క్లుప్తంగా

అయ్యప్ప సన్నిధిలో విషు పూజ



పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కళ సమేత శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం విషు పూజను ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి బియ్యం, నాణేలతో అభిషేకాలు చేశారు. గోత్రనామార్చన జరిగింది. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిపారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు



సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత దినేష్‌చంద్రకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన దినేష్ చంద్ర లక్ష రూపాయల విరాళాన్ని నగదు రూపంలో అందించారు. సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో సంబంధిత నగదును అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు పీఆర్వో కార్యాలయ పర్యవేక్షణాధికారి విక్రమ్, ఆలయ సూపరింటెండెంట్ బాండ్ ఇచ్చారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

భార్యతో గొడవపడి భర్త అదృశ్యం



నూకరాజు

పెందుర్తి: భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన ఓ వ్యక్తి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పురుషోత్తపురం కాలనీలో నివాసం ఉంటున్న వాకాడ నూకరాజు(38) తన భార్యతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని చెప్పి బట్టలు సర్దుకుని వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ జి.అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కలు భౌబోయ్!

- భయపెడుతున్న గ్రామసింహాలు
- చికెన్, ఫిష్ దుకాణ వ్యర్థాలే ఆహారం
- వాహనాలను వెంబడించి.. ప్రమాదాలకు కారణమై..
- రోడ్డు మీదకు వచ్చేందుకు పిల్లలు, వృద్ధుల్లో భయం



వాడచీపురుపల్లిలో రోడ్లపై తిరుగాడుతున్న వీధి కుక్కలు

పరవాడ:

మండలంలోని చాలాప్రాంతాల్లో వీధి కుక్కలు విచ్చల విడిగా సంచరిస్తున్నాయి. రోడ్ల మీదకు రావాలంటే ప్రజలు భయపడే పరిస్థితి. మండల పరిధి వాడచీపురుపల్లి, తానాం, పరవాడ, దేశపాత్రునిపాలెం, గొర్లివానిపాలెం, రావాడ, వెన్నలపాలెం, కలపాక, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం గ్రామ పంచాయతీల్లో వీటి బెడద అధికంగా ఉంది. రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తున్న గ్రామ సింహాల కారణంగా తమ పిల్లల్ని స్కూళ్లకు పంపించే సమయంలో తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.



తానాం రోడ్డులో విచ్చలవిడిగా సంచరిస్తున్న శునకాలు

చికెన్, ఫిష్ వ్యర్థాల వల్లే..

ఉదయాన్నే దైనందిన పనుల్లో భాగంగా భాగంగా పట్టణ ప్రాంతాలకు వాహనాలపై రాకపోకలు సాగించే వారిపై కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి. రోడ్లపై నిద్రిస్తూ వాహన శబ్దం రాగానే లేచి, వెంటపడి తరుముతున్నాయి. భయంతో వేగాన్ని పెంచి ప్రమాదాల బారిన పడుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. పరవాడ, వాడచీపురుపల్లి, దేశపాత్రునిపాలెం ప్రాంతాల్లో నిర్వహిస్తున్న మాంసం, చేపల దుకాణాల వద్ద వీధి కుక్కలు అధికంగా తిరుగాడుతున్నాయి. దుకాణదారులు పారబోసిన వ్యర్థాలను తింటూ తమ సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి. ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల్లో లభ్యమవుతున్న పచ్చి చేపలు, తాబేళ్ల కళేబరాలను తింటూ బీచ్‌లకు వచ్చే పర్యాటకులపై దాడులకు పాల్పడుతున్న సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. రాత్రి సమయాల్లో వీధుల్లో అరుపులతో విచ్చల విడిగా సంచరిస్తూ, కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. రావాడ ప్రాంతంలో కోళ్ల ఫారాల వద్ద వీటి సంచారం మరీ ఎక్కువగా కనిపిస్తోంది.

పెరుగుతున్న కుక్కకాటు బాధితులు



వీధి కుక్కల దాడులతో ప్రతి రోజు వాడచీపురుపల్లి, పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సగటున ముగ్గురు చొప్పున వచ్చి వైద్యం పొందుతున్నారు. మండలంలో వీధి కుక్కల నియంత్రణకు పంచాయతీల అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా వాటి సంతతి రోజు రోజుకీ పెరుగుతోంది. వీధి కుక్కల నియంత్రణ చర్యల పేరిట మొక్కుబడి కార్యాచరణతో అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. ఇటీవల పరవాడలో చేపట్టిన వీధి కుక్కల నియంత్రణ కార్యక్రమాన్ని ఉదాహరణగా పేర్కొంటున్నారు. వాడచీపురుపల్లి, పరవాడ పీహెచ్‌సీల పరిధిలో రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉండడంతో ప్రజలు కొంత మేర ఊపిరి పీల్చుకుంటున్నారు.

ఇంజక్షన్ల లభ్యత

పీహెచ్‌సీ	కుక్క కాటు	పాముకాటు
వాడచీపురుపల్లి	90	50
పరవాడ	150	25

పీహెచ్‌సీల వారీగా కుక్కకాటు బాధితులు

నెల	పరవాడ	వాడచీపురుపల్లి
డిసెంబర్	54	34
జనవరి	69	39
ఫిబ్రవరి	61	35
మార్చి	37	30

రోడ్డు మీదకు రావాలంటే భయం



పరవాడలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలతో రోడ్డు మీదకు రావాలంటేనే భయమేస్తోంది. గ్రామంలో ఎక్కడిపడితే అక్కడ వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ దాడులకు పాల్పడుతున్నాయి. వాహనాల వెంట పడుతూ వాహనచోదకులను తరుముతున్నాయి. చిన్న పిల్లలను ఒంటరిగా స్కూళ్లకు పంపాలంటే భయమేస్తోంది. మా ఇబ్బందుల్ని చూసైనా, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చుక్క గోపి, పరవాడ

వీధి కుక్కలను నియంత్రించాలి



వెన్నలపాలెంలో వీధి కుక్కల బెడద రోజు రోజుకీ పెరుగుతోంది. ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా కనిపిస్తున్నాయి. మహిళలు, చిన్నపిల్లలు ఇల్లు దాటి బయటకు రావాలంటే భయపడుతున్నారు. చేలల్లో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లపై దాడులకు పాల్పడుతూ తినేస్తున్నాయి. ఆర్థికంగా నష్టపోతున్నాం. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవట్లేదు. నియంత్రణ చర్యలు తీసుకోవాలి.

– యలమంచిలి కనకరత్నం, వెన్నలపాలెం

వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి



కుక్క, పాము కాట్లకు పీహెచ్‌సీల్లో వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. వీటి బారిన పడిన రోగులు ఆస్పత్రిని సంప్రదించి ఉచితంగా వైద్యం పొందవచ్చు. గాయపడిన వ్యక్తులను నేరుగా ప్రభుత్వ వైద్యశాలలకు తీసుకొచ్చి వైద్యులు సూచించిన మందులు వాడాలి. చిన్న పిల్లలను కుక్కలకు దూరంగా ఉంచాలి. కుక్క, పాము కాట్లకు గురైన వారు మూఢ నమ్మకాలతో పసర మందులను ఆశ్రయించవద్దు.

– జయశ్రీ కరిష్మా, ప్రభుత్వ వైద్యాధికారి, పరవాడ

నేడు దేవదాయ శాఖ మంత్రి విశాఖ రాక

- రేపు సింహాచలంలో చందనోత్సవంపై సమీక్ష

సింహాచలం: రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం రాత్రి విశాఖ రానున్నారు. రాత్రి 9.30కు గన్నవరం ఎయిర్‌పోర్టులో బయల్దేరి 10.45కు విశాఖ ఎయిర్‌పోర్టుకి చేరుకోనున్నారు. అక్కడి నుంచి రాత్రి 11.20కు నగరంలోని ఐటీసీ గ్రాండ్‌బే హోటల్‌కు చేరుకుని, అక్కడే బస చేస్తారు. బుధవారం ఉదయం సింహాచలం చేరుకుంటారు. ఈ నెల 30న జరిగే చందనోత్సవం నిర్వహణపై రెవెన్యూ మంత్రి, హోం మంత్రి, దేవదాయశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ తదితర అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సమీక్ష ముగిసిన తర్వాత తిరిగి ఐటీసీ గ్రాండ్ బేకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30కు బయల్దేరి ఎయిర్‌పోర్టుకి చేరుకుని, అక్కడి నుంచి హైదరాబాద్‌కి వెళ్తారు.

ఘనంగా మర్లమ్మతల్లి ఆలయ పునఃప్రారంభం



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు



మర్లమ్మతల్లి నూతన విగ్రహం

సబ్బవరం: సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధి పెదనాయుడుపాలెం గ్రామ దేవత మర్లమ్మతల్లి పునర్నిర్మిత ఆలయ ప్రారంభోత్సవం, కలశ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు తేజశర్మ, జనార్దనశర్మ ఆధ్వర్యంలో చండీ హోమం, నవగ్రహ పూజ, బ్రహ్మ పూజ, యంత్రపూజ ఘనంగా జరిపారు. ఆలయ ధర్మకర్త సబ్బవరపు నాగేంద్ర, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రక్తదాన శిబిరానికి స్పందన



దాతలకు ధ్రువపత్రం అందిస్తున్న దాడి శ్రీను

పెందుర్తి: స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన లభించింది. సరిపల్లికి చెందిన భీమ్‌రామ్ యువజన సేవా సంఘం సహకారంతో జరిగిన శిబిరంలో 30 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. దాతలకు నిర్వాహకులు ధ్రువపత్రాలు అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీనివాస్, సభ్యులు పెతకంశెట్టి ఉమాశంకర్రావు, సిరిమళ్ల గణేష్, కారి సూర్యనారాయణ, పెంటకోట గణేష్, బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వి.వినోద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

పరవాడ: జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో జేఎన్‌పీసీ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్, ఎంఏఎస్ఆర్ఎం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను ఘనంగా నిర్వహించాయి. అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక అధికారి(ఏడీఎఫ్‌వో) అనకాపల్లి నాగేశ్వరరావు పాల్గొని, 1944 ఏప్రిల్ 14న ముంబై డాక్‌యార్డ్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు. అగ్ని మాపక సిబ్బంది వివిధ విన్యాసాలను ప్రదర్శించారు. ఫైర్ సేఫ్టీ స్కిట్‌లో భాగంగా విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని కాపాడి సీపీఆర్ నిర్వహించడం, వివిధ రకాల మంటల్ని అగ్నిమాపక పరికరాలతో ఆర్పడం, విషవాయువుల్లో చిక్కుకున్న వారిని కాపాడడం తదితర విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విన్యాసాలు నిర్వహించిన అగ్నిమాపక సిబ్బందికి బహుమతులు అందించారు. ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీలో..

పరవాడ: ప్రతి ఒక్కరు భద్రత నియమాలు పాటించాలని సింహాద్రి ఎన్టీపీసీ ఓ అండ్ ఎం జీఎం పి.కె.జెనా సూచించారు. సింహాద్రి ఎన్టీపీసీలో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సేవా వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సింహాద్రి ఎన్టీపీసీలో సీఐఎస్ఎఫ్ సేవలను ఆయన ప్రశంసించారు. అగ్నిమాపక సేవా వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రామ్ లఖన్‌సింగ్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాల్లో భద్రతలపై ఉద్యోగులు, కార్మికులు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా అమరవీరులకు పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. రెండు నిముషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ హిమ్మత్ సింగ్ పాల్గొన్నారు.



వారోత్సవ అవగాహన కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఫైర్ ఆఫీసర్ సత్యరాజు, సిబ్బంది

సబ్బవరం: స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదంలో అమరులైన అగ్నిమాపక వీరులకు స్థానిక అగ్నిమాపక అధికారి జీవీ సత్యరాజు, సిబ్బందితో కలిసి నివాళులర్పించారు. ఈ నెల 20 వరకు అగ్నిమాపక భద్రతపై విద్యా సముదాయాలు, ఆస్పత్రులు, పరిశ్రమలు, బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలు, పెట్రోల్ బంకుల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు సత్యరాజు తెలిపారు. అనంతరం వారోత్సవాలపై అవగాహన కోసం రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న ఏడీఎఫ్‌వో నాగేశ్వరరావు



సింహాద్రి ఎన్టీపీసీలో.. సీఐఎస్ఎఫ్ సిబ్బంది

భావితరాలకు స్ఫూర్తి అంబేడ్కర్



పెందుర్తి రెవెన్యూ కార్యాలయంలో.. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, కార్యాలయ సిబ్బంది నివాళి

పెందుర్తి: దేశానికి దిశ, దశను నిర్దేశించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ లాంటి మహనీయుడు పుట్టిన దేశంలో పుట్టడం ప్రతి భారతీయునికి గర్వకారణం అన్నారు.

- పెందుర్తి రెవెన్యూ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆర్.ఐ. దివ్య, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.
- పోలీస్ స్టేషన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి సీఐ కె.వి.సతీష్‌కుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్‌ఐ ఆసిరితాత, సిబ్బంది పాల్గొన్నారు.
- రాంపురంలోని గ్రామ సచివాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.
- పెదగాడి ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ కేసుబోయిన లావణ్య త్రినాథ్, ఎంపీటీసీ నందవరపు అప్పలరాజు నివాళి అర్పించారు. పారిశుధ్య కార్మికులను సత్కరించి దుస్తులు అందించారు.
- చినముషిడివాడలోని అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు పూలమాల వేసి అంజలి ఘటించారు. బీజేపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ సతీష్‌కుమార్, సిబ్బంది

- పినగాడి ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ సేవా సంఘం ప్రతినిధులు అంజలి ఘటించారు.
- లక్ష్మీపురంలో వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి మనాలత జోబ్‌దాస్(చిన్ని) ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మిఠాయిలు, మజ్జిగ పంపిణీ చేశారు.
- పెందుర్తిలోని అంబేడ్కర్ విగ్రహానికి సీపీఐ నాయకులు ఆర్.శ్రీనివాసరావు, ఎర్రిపల్లి రాంబాబు నివాళులర్పించారు.
- సీపీఎం నేత బి.జగన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.
- బీఎస్పీ ఆధ్వర్యంలో దళిత, ప్రజాసంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

పరవాడ: స్థానిక ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు ముత్యాల అప్పారావు, నమోబాబు, సతీష్‌రాజు, నూకరాజు, కూండ్రపు సోమునాయుడు పాల్గొన్నారు.

- ముత్యాలమ్మపాలెం శివారు సమ్మెంగపాలెంలో కూటమి నాయకులు అరిజిల్లి అప్పలరాజు, మూస రామకృష్ణ, చింతకాయల రవి, ముత్యాలు, ఎస్.అప్పారావు, వెన్నల నూకరాజులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పండ్లు, బిస్కెట్లు, శీతల పానీయాలు పంచిపెట్టారు.
- సాలాపువానిపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సాలాపు సంతోష్, శ్రీను, అప్పలరాజు, కృష్ణ, దొరబాబు, అప్పన్న, మనోహర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.
- పెదముషిడివాడలో అనకాపల్లి జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు, న్యాయవాది బంధం వెంకటరమణ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పెందుర్తిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత శరగడం



పెందుర్తిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటిస్తున్న సీపీఐ నేతలు

వాడవాడలా వేడుకగా అంబేడ్కర్ జయంతి

అసమానతల్లేని సమాజ స్థాపనే అంబేడ్కర్‌కు ఘన నివాళి



సబ్బవరం: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకుంటూ బాధ్యతలను విధిగా నిర్వర్తిస్తూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశించిన అసమానతల్లేని సమాజం కోసం కృషి చేయడమే ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళి అని హైకోర్ట్ రిజిస్ట్రార్(అడ్మిన్) వీఎస్ఎస్ శ్రీనివాస శర్మ తెలిపారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయవిశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ)లో సోమవారం నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భీమవరం జిల్లా జడ్జి బి.లక్ష్మీనారాయణ, వర్సిటీ వీసీ ఆచార్య డి.సూర్యప్రకాశరావు, రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్ మదాసుతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్న దేవస్థానంలో..

సింహాచలం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సింహాచలం దేవస్థానం పరిపాలనా కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఈవో కె.సుబ్బారావు పూలమాలవేసి నివాళులర్పించారు. భారతదేశానికి రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, ఈఈ రాంబాబు, పరిపాలనా విభాగం ఏఈవో రాజేంద్రకుమార్, డీఈ హరి, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పెదగాడిలో.. నివాళులర్పిస్తున్న సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ అప్పలరాజు

- అడవివరంలోని ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వార్డు మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, పార్టీ నాయకులు బోర కృష్ణారెడ్డి, దమ్ము ఎర్రాజీరావు, తెడ్లపు మహేష్, మజ్జి అప్పలరమణ, ఆకుల నాగరాజు, మజ్జి ధర్మా, బోర మోహనరెడ్డి, లండ వెంకటరమణ, ఎస్సీ కాలనీ వాసులు మునపర్తి శివ, నక్కిడాపు చంటి, వంగలపూడి అప్పారావు పాల్గొన్నారు.
- అడవివరం గ్రంథాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం పూలమాలవేసి నివాళులర్పించారు. కార్మిక నాయకుడు సీహెచ్ఎస్ఎన్ రాజు, సహకారశాఖ ఆడిటర్ పి.ఈశ్వరరావు, గ్రంథాలయ ఉద్యోగి ఎల్లమ్మ, పాఠకులు భానుమూర్తి, రమేష్, అను, హేమ, గాయత్రి, మహేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం: స్థానిక సాయినగర్ ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

- మొగలిపురంలోని ఎస్సీ కాలనీలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు యడ్ల నాయుడు, ఐడి బాబు, సిరపరపు వాసు, దొమ్మి ఈశ్వరరావు, ఐ.గోపి తదితరులు పాల్గొన్నారు.
- బంగారమ్మపాలెం ఎస్సీ కాలనీలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొటాన రాము, ఆరిపాకలో పార్టీ జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



అంబేడ్కర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేతలు



రాంపురం సచివాలయంలో నివాళులర్పిస్తున్న సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, మాజీ జెడ్పీటీసీ నారాయణరావు, తదితరులు



పెందుర్తిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, ఎంపీపీ నాగమణి



సింహాచలం దేవస్థానం పరిపాలనా కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి నిర్వహిస్తున్న ఈవో సుబ్బారావు, సిబ్బంది



అడవివరం ఎస్సీ కాలనీలో.. 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు



మొగలిపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గండి రవికుమార్ తదితరులు



పరవాడ ఎస్సీ కాలనీలో.. నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



సమ్మెంగపాలెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు



పెదముషిడివాడలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న న్యాయవాది వెంకటరమణ, తదితరులు